నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజాంపేట్ : మయూరి నగర్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని విద్యుత్ అధికారి ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ రాంనరేష్ నగర్ ఓహెచ్ పరిధిలో ఎస్ రాజు నగర్, మిత్ర హిల్స్, ప్రశాంత్‌నగర్‌లో మధ్యాహ్నం 2 నుంచి 4:30 గంటల వరకు, మయూరి నగర్ సబ్‌స్టేషన్ ఫీడర్‌లలో 11కేవీ రాంనరేష్ నగర్ కేబుల్ ఫీడర్‌లో హైదర్‌నగర్ గ్రామం, రాంనరేష్ నగర్, వెర్టెక్స్ అపార్ట్‌మెంట్లు, శ్రీనివాస అపార్ట్‌మెంట్స్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆలయంలో 22న టెండర్


ఆలయంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారు

జగద్గిరిగుట్ట : జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన 54వ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 3 రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. 3వ తేదీన స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని లడ్డు ప్రసాదం అమ్మకం, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, లైటింగ్ డెకరేషన్‌కు గాను టెండర్ కం పబ్లిక్ వేలం పాట ఈ నెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల సభ్యులు దేవాలయ కార్యాలయంలో సంప్రదించవచ్చని వారు తెలిపారు.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి


కొలన్ హన్మంతరెడ్డిని సన్మానిస్తున్న కోటేశ్వరమ్మ

నిజాంపేట్ : కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తూ ప్రజా సేవకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా సెక్రటరీగా ఎన్నికైన కోటేశ్వరమ్మ ఆదివారం బాచుపల్లిలోని కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించారు. అనంతరం ఆమెను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎంసీ ప్రెసిడెంట్ కొలన్ రాజశేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు కొలన్ బాల్‌రెడ్డి, మౌలేశ్వరరావు, యోగా టీచర్ రమా తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో సైన్ బోర్డుల ఏర్పాటు


సైన్ బోర్డు ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు

జగద్గిరిగుట్ట : చింతల్ పద్మానగర్ ఫేజ్ 1లో ఆదివారం రోడ్డు నంబర్లు చూపే సైన్ బోర్డులను ఏర్పాటు చేశారు. సుమారు 32 ఎకరాలలో ఉన్న పద్మానగర్‌లో 26 రోడ్డులు(గల్లీలు) ఉన్నాయని, వీటికి 36 సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షులు సత్తిరెడ్డి, ఉపాధ్యక్షులు దేవేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దయాకర్, సుబ్బారావు, రమణరెడ్డి, వేణు, వినోద్ సింగ్, ప్రభంజన్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింహా రెడ్డి, సురేందర్ రెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

26న కేన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి రాందేవ్‌రావ్ హాస్పిటల్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 26న ఉదయం 9 నుంచి 2 గంటల వరకు కేన్సర్ నిర్ధారణ ఉచిత వైద్య మెగా శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరంలో నోటి కేన్సర్, రొమ్ము కేన్సర్, మలద్వార కేన్సర్, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ వంటి పలు రకాల కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైనటువంటి ఎక్స్‌రే, ఎంఆర్ఐ, సీబీపీ లిక్విడ్ బేస్డ్ సైటాలజీ, హెచ్‌పీవీడీఎన్ఏ టెస్టింగ్, యూఎస్‌జీ అబ్డోమెన్‌వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరం రాందేవ్ రావ్ అడ్మిన్ మేనేజర్స్ సీఈఓ డాక్టర్ యోబు, ఎండీ డాక్టర్ కమలాకర్, హాస్పిటల్ యజమానులు విక్రమ్‌దేవ్ రావు, మీరా రావు, అపర్ణరావు, ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు.

చిత్తారమ్మకు బోనం.. పోటెత్తిన భక్తజనం

- పూజలు నిర్వహించిన ఎంపీ, ఎమ్మెల్యే
- పోలీసుల పటిష్ట బందోబస్తు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు






శివసత్తుల పూనకం, పోతరాజుల విన్యాసం డప్పు చప్పుల మధ్య బోనాల ఊరేగింపుతో గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బోనాలు సమర్పించి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఒడిబియ్యం నింపారు. ఇతర జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు ఆలయ ప్రాంగణంలో పోటెత్తారు. గాజులరామారం గ్రామం నుంచి ఆలయం వరకు పోతరాజుల నృత్యాల మధ్య అమ్మవారి రథం ఊరేగింపు కనుల పండువగా జరిగింది. బాలానగర్ డీసీపీ పరిధిలో 300 మంది పోలీసు సిబ్బందితో గట్టి భద్రత ఏర్పాటు చేశారు. ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హనుమంతరెడ్డి, కార్పొరేటర్లు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

–సుభాష్‌నగర్




అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


చిత్తారమ్మను దర్శించుకున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి తదితరులు


చిత్తారమ్మను దర్శించుకున్న ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు




అమ్మవారికి భక్తులు సమర్పించిన ఒడిబియ్యం


అమ్మవారికి మొక్కును చెల్లిస్తున్న భక్తుడు


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు




ట్రాఫిక్‌పై అధికారులను అడిగి తెలుసుకుంటున్న ట్రాఫిక్ డీసీపీ గుణశేఖర్


చిత్తారమ్మను దర్శించుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్






సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తూ..

అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడు


జయంతి వేడుకలో పాల్గొన్న ఎంపీ రాజేందర్

సుభాష్‌నగర్: సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో ఆదివారం లూయిస్ బ్రెయిలీ 216వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటల రాజేందర్ హాజరై మాట్లాడారు. లూయిస్ బ్రెయిలీ చూపులేని వారు చదువుకునేందుకు బ్రెయిలీ లిపిని అందించి ఎంతో మందికి అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడన్నారు. లూయిస్ బ్రెయిలీ భవన విస్తరణకు తన పూర్తి సహకారం ఉంటుందన్నారు. విన్నర్ ఫౌండేషన్ అధ్యక్షుడు జీవరత్నం ఆధ్వర్యంలో 250 మంది దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీరాములు, ఫిషింగ్ కార్పొరేషన్ జిల్లా చైర్మన్ మన్నె రాజు, సేవ్ ట్రస్ట్ చైర్మన్ రఘు, ఏఐసీబీ వైస్ ప్రెసిడెంట్ చుక్కారావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ద బ్లైండ్ అధ్యక్షుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య కళాకారిణికి సన్మానం


మౌలికను సన్మానిస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు

కుత్బుల్లాపూర్/జీడిమెట్ల: నృత్య మండలి సభ్యురాలు మౌలిక బొల్లినాడిని ఆదివారం ఐద్వా, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. షాపూర్‌నగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు రావుల స్వాతి, సీఐటీయూ మండల అధ్యక్షుడు కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన మౌలిక దేశ, విదేశాల్లో వివిధ వేదికలపై నృత్య ప్రదర్శనలిస్తూ యునెస్కో అంతర్జాతీయ నృత్య మండలిలో సభ్యురాలిగా ఎదిగారని, ఇది మనకెంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి దేవదానం, డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, నాయకులు సైదులు, తిమ్మప్ప, స్నేహసింగ్ పాల్గొన్నారు.

26న ఉచిత కంటి వైద్య శిబిరం

కూకట్‌పల్లి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26న మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 9:30 గంటల నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు.

శ్రీత్యాగరాజ ఆరాధన

మోతీనగర్: పుష్య బహుళ పంచమి రోజు తిరువాయురు, తమిళనాడులో సద్గురు శ్రీత్యాగరాజ ఆరాధన జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా కర్ణాటక సంగీత కళాకారులు తమ తమ ప్రదేశాలలో ఒక ఉత్సవంగా ఈ ఆరాధన జరుపుకుంటారు. ఈ సంవత్సరం 178వ ఆరాధన జరుగుతున్నది. ఇందులో భాగంగా మోతీనగర్‌లోని బీఎస్‌పీ కాలనీ నుంచి శ్రీ శంకరమఠం వరకు పుచ్చా రాజ్యలక్ష్మి, డాక్టర్ మృదుల కిరణ్ నిర్వహణలో ఆదివారం ఉదయం 9:30 నుంచి నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఆమె శిష్యులు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఫిబ్రవరి 1న మోతీనగర్ శంకరమఠంలో ప్రయుక్త వాగ్గేయకార ఉత్సవాలు జరుపుకోనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్రీత్యాగరాజ ఆరాధనలో పాల్గొన్న సంగీత కళాకారులు, స్థానికులు

కనుల పండువగా కల్యాణం


మేడాలమ్మ కేతమ్మ మల్లికార్జున స్వామివారు


పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్ పాలాల బస్తీలోని మల్లికార్జున స్వామి ఆలయంలో మేడాలమ్మ కేతమ్మ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన తదితర పూజల అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం ఎల్లమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టి సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడ ఐలయ్య, గుడిమెట్ల సురేష్ రెడ్డి, పుప్పాల భాస్కర్, పోతే శ్రీకాంత్, వేణు, జైహింద్, నరసింహ, జయకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షులు సుజీత్, ఉపాధ్యక్షులు రాజు, ట్రెజరర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: యువత అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పీఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఆర్ వన్ గ్లోబల్ కన్సల్టెన్సీ సర్వీసెస్, ఆస్ట్రేలియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా విదేశాలలో హాస్పిటల్ సంబంధిత ఉపాధి అవకాశాలు, మేనేజ్‌మెంట్ కోర్సులపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ వన్ గ్లోబల్ హాస్పిటల్ సర్వీసెస్ సంస్థ హైదరాబాద్‌లో సేవలందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి అవకాశాలు వస్తాయన్నారు. ఆర్ వన్ గ్లోబల్ సర్వీసెస్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా వృత్తిపరమైన అవకాశాలు కల్పించేందుకు శక్తి సామర్థ్యాలను ఏర్పాటు చేస్తుందని ఆర్‌వన్ గ్లోబల్ సర్వీసెస్ డైరెక్టర్ నాగేశ్వర రావు పేర్కొన్నారు.